www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 17 ఏప్రిల్ 2023

5

అన్నమయ్య



జిల్లాకు చేరిన ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్న విద్యాకానుకలో భాగంగా 2023-24 విద్యా సంవత్సరములో 6వ తరగతిలో ప్రవేశించే విద్యార్థులకు అందించడానికి 17,750 ఆక్ఫ్‌ఫర్డ్ నిఘంటువులు జిల్లాకు చేరినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. ఆదివారం ఢిల్లీ నుండి రాయచోటికి చేరిన నిఘంటువులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివే 6 నుంచి10 తరగతుల విద్యార్థులలో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించడానికి 2021-22వ సంవత్సరం నుంచి జగనన్న విద్యాకానుకలో భాగంగా నిఘంటువులు ఉచింతంగా అందిస్తామన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 6 జిల్లాకు 17,750 నిఘంటువులు వచ్చాయన్నారు. వీటిని విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇప్పటికే గుర్తించబడిన మండల స్టాక్ పాయింట్లకు త్వరలోనే చేరవేస్తామన్నారు. జూన్ 12 నాటికి జగనన్న విద్యాకానుక పూర్తీ కిట్టు అందివ్వడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. మార్కెట్ లో దాదాపు రూ. 400 విలువ చేసే ఇంగ్లీషు ఇంగ్లీషు తెలుగు నింఘటువులు విద్యార్థులకు ఉచింతంగా అందజేస్తున్నామని, సద్వినియోగ చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కరుణాకర్ పాల్గొన్నారు.

'పెట్రో' పోటు!



- 8 ఏళ్లగా బిజెపి సర్కారు హాళన
- 100 దఫాలకుపైగా పెట్రో ధరల పెంపు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలో సుమారు 12 లక్షలకుపైగా వాహనాలు ఉన్నాయి. అత్యధికంగా మోటార్‌బైక్‌లు, ఆటోలు, లారీలు, ట్రాక్టర్లు ఉన్నాయి. సుమారు లక్షకుపైగా మోటార్‌బైక్‌లు, 25 వేలకుపైగా ఆటోలు, ఇతర వాహనాలు ఉన్నాయి. వీటిపైనే నిరుద్యోగ యువత, పేద, మధ్య తరగతి ప్రజానీకం ఆధారపడి జీవనం సాగిస్తోంది. 2014 సంవత్సరంలో రూ.62 నుంచి 2023 నాటికి లీటర్ పెట్రోల్ రూ.111 డీజిల్ రూ.98.89 చేరుకోవడం ఆందోళన కలిగించింది. 2014 నుంచి కేంద్రం ధరల దరువు మోగిస్తూనే ఉంది. ఒకవైపు కరోనా విజృంభణ, మరోవైపు ఉపాధి కరువై నిరుద్యోగం ప్రబలిన పరిస్థితుల్లోనూ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి బిజెపి సర్కారు తన నిజరూపాన్ని బయట పెట్టుకుంది. 2018 సంవత్సరంలో జూలై నుంచి నవంబర్ వరకు రోజు మార్చి రోజు చొప్పున వరుసగా పెరుగుతున్న పెట్రో, డీజిల్ ధరలతో సామాన్యులు బెంబేలెత్తిపోవడం ఆందోళన కలిగించింది. జిల్లాలో ప్రతిరోజూ పెట్రోల్ నాలుగు లక్షల లీటర్లు, డీజిల్ 5.50 లక్షల లీటర్లు వినియోగం అవుతోంది. పెట్రోల్ ధర రూ.111.11 చొప్పున 4.5 కోట్లు, డీజిల్ రూ. 5.5 కోట్ల చొప్పున వసూలు అవుతోంది. 2014లో యుపిఎ హయాంలో పెట్రోల్ రూ.62 నుంచి రూ.67, డీజిల్ సుమారు రూ.35 చొప్పున ఉన్నప్పుడు రూ.2.5 కోట్ల చొప్పున పెట్రోల్, డీజిల్ రూ.1.5 కోట్ల చొప్పున ఆదాయం లభించేది. ఎన్‌డిఎలోని బిజెపి సర్కారు హయాంలో పెట్రో ఉత్పత్తుల ధరలు ఆకాశానికి అంటడం తెలిసిందే. ఫలితంగా రోజుకు రూ.4.5 కోట్ల పెట్రోల్ ఆదాయం, 5.5 కోట్ల డీజిల్ ఆదాయం లభిస్తోంది. రెట్టింపు స్థాయిలో ధరలను రెట్టింపు స్థాయిలో పెంచేసింది. జిల్లా నుంచి వందల కోట్లలో ఆదాయము లభిస్తోంది. గతేడాది ఫిబ్రవరి నుంచి రష్యా-యుక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా క్రూడాయిల్ ధరపై అమెరికా ఆంక్షలు విధించింది. 20 నుంచి 30 శాతం తగ్గింపు ధరలతో రష్యా తన చమురును ఇండియాకు విక్రయిస్తోంది. 90 డాలర్ల క్రూడాయిల్ బ్యారల్ ధరల్లో సుమారు 20 నుంచి 30 డాలర్లకు తక్కువగా విక్రయిస్తోంది. పెట్రో వినియోగ దారులకు ధరల తగ్గింపుల్లో ఊరట లభించ కపోవడం ఆందోళన కలిగిస్తోంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినప్పుడు అంతర్జాతీయంగా ధరలు పెరగడం వల్ల పెట్రో ధరలు పెరగడం అనివార్యమని సెలవిచ్చిన కేంద్ర మంత్రులు అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పుడు తగ్గించకపోవడంలోని ఆంతర్య మేమిటో చెప్పడం లేదు. 2020, 2021 సంవత్సరాల్లో ఒక దశలో బ్యారల్ చమురు 25 డాలర్లకు పడిపోయింది.

కేంద్రంలోని బిజెపి సర్కారు మధ్య తరగతి జేబులకు భారీగా చిల్లులు పెట్టింది. 2014 నుంచి నేటి వరకు ఎనిమిదేళ్ల వ్యవధిలో సుమారు 75 నుంచి 100 దఫాలకుపైగా పెట్రో, డీజిల్ ధరలను పెంపు రూపంలో బాదేసింది. 2014 యుపిఎ హయాంలో పెట్రోల్ రూ.67 ఉండగా, కేంద్రంలోని బిజెపి సర్కారు హయాంలో ఎనిమిదేళ్లలో సుమారు రెట్టింపు చేసింది. పెట్రోల్ ధర రూ.111.11, డీజిల్ ధర రూ.43 నుంచి రూ.90 చేరుకుంది. యుపిఎ హయాంలోని ధరలను రెట్టింపునకు మించిన స్థాయిలో పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి కడప జిల్లాపై రోజుకు యుపిఎ హయాంలో సుమారు రూ.2.5 కోట్లు ఉన్నట్లు అంచనా. ఎన్‌డిఎ హయాంలో పెట్రోల్‌పై రూ.4.5 కోట్లు, డీజిల్‌పై రూ.5.5 కోట్ల చొప్పున ఎనిమిదేళ్లకు సుమారు రూ.వందల కోట్ల భార పడింది. ఉత్తరాధి రాష్ట్రాల్లో ఎన్నికలు ఉంటే ధరల పెంపు జోలికి వెళ్లదు. లేకపోతే ధరల పెంపునకు అడ్డూ అదుపు లేకుండా పెంచుతోంది.

సామాన్యులపై కేంద్రం దోపిడీ



ఒక వస్తువు ఉత్పత్తికి సంబంధించిన ముడిసరుకు ధరలు తగ్గితే దానికి అను గుణంగా మార్కెట్లో ఆ వస్తువు ధర తగ్గాలి. ఇందుకు ధరల తగ్గినా ప్రజలపై భారాలు తగ్గించ చడం లేదు. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా సామాన్యుల జేబులు గుల్ల చేస్తూ దోపిడీ చేస్తోంది.

- డి.వెంకటేష్, వాహనదారుడు, పోరుమామిళ్ల

పేదలకు పెను భారం



మోడీ ప్రభుత్వం పేదల పాలిట పెనుభారంగా తయారైంది. పేదలను, ధనికులను ఒకే గాటికి కట్టేస్తూ గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. స్కూటర్లు అమ్ముకొని సైకిళ్లుకొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి.

- టి.పాలిక్షప్ప, వాహనదారుడు, రాజంపేట.

పెట్రోల్ ధరలను తగ్గించాలి



సామాన్య ద్విచక్ర వాహనదారులపై బిజెపి ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచి అధిక భారాలు మోపుతున్నారు. పెట్రోల్ ధరలు తక్షణమే తగ్గించాలి. ప్రభుత్వం పెట్రోల్ ధరలు తగ్గించి సామాన్యులపై భారం తగ్గించాలి

- జి.బాబు నిరంజన్‌రెడ్డి, వాహనదారుడు వల్లూరు.

పెట్రో భారాన్ని అరికట్టాలి



రోజురోజుకీ పెరుగుతున్న పెట్రోలు ధరలు సామాన్యులకు అధనపు భారం. పెట్రోలు ధరల బాదుడుతో చేతి చమురును వదిలించుకోవలసి వస్తోంది. మధ్య తరగతి వారికి ఈ పెట్రోలు ధరల వాత తట్టుకోలేనిదిగా ఉంది.

-ఎస్.రఘునాథ్, వాహనదారుడు, వీరబల్లి.

నెత్తురోడిన రహదారులు

- ఉమ్మడి జిల్లాలో ఏడుగురు మృతి
- వైఎస్ఆర్‌లో ముగ్గురు యువకులు, అన్నమయ్యలో నలుగురు మృత్యువాత
- రెండు జిల్లాలోనూ విషాద ఛాయలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వైఎస్ఆర్ జిల్లాలో ముగ్గురు యువకులు, అన్నమయ్య జిల్లాలో నలుగురు మృత్యువాత పడ్డారు. వైఎస్ఆర్ జిల్లాలో జాతర చూసుకుని తిరుగు వస్తుండగా, అన్నమయ్య జిల్లాలో వైద్యం కోసం వెళ్తుండగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో రెండు జిల్లాలో రోడ్లు నెత్తురోడ్డాయి. వివరాలు..

గంగాధర్‌రావు, ఎఎస్‌పి రాజకమల్, డిఎస్‌పి శ్రీధర్, సం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదంపై సిఐ వరప్రసాద్, రామాపురం ఎస్ఐ కొండారెడ్డిని అడిగి తెలుసుకున్నారు.



చెన్నూరు : దుర్మరణం చెందిన యువకులు దినేష్, సురేష్, సుబ్బయ్య

వైద్యం కోసం వెళ్తూ.. నలుగురు

ప్రజాశక్తి-రామాపురం

కర్నూలు - చిత్తూరు 40 వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని నలుగురు మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కడప జిల్లా బద్వేల్ పట్టణానికి చెందిన నరసయ్య (47), లక్ష్మమ్మ (65), చిన్నక్క (60), రాజారెడ్డి (35), హర్షవర్ధన్ కారులో వైద్యం కోసం చిత్తూరు జిల్లా విరూపాక్షపురానికి బయలుదేరారు. రామాపురం మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ కొత్తపల్లి క్రాస్ వద్ద పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న మరో కారు వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మమ్మతోపాటు కుమారుడు నరసయ్య, కారు డ్రైవర్ రాజారెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కడప రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. వీరిలో చిన్నక్క చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతిచెందారు. ఉమ్మడి కడప జిల్లాకు పక్కవాడ ఉండడంతో వైద్యం కోసం చిత్తూరు జిల్లాకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. మరో కారులో ప్రయాణిస్తున్న గుజ్జల వెంకట నాగేంద్ర వరప్రసాద్, తన భార్య కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే అన్నమయ్య జిల్లా ఎస్‌పి



రామాపురం : రోడ్డుపై చెల్లాచెదురుగాపడిన మృతదేహాలు

జాతరకు వెళ్లి వస్తూ.. ముగ్గురు యువకులు

ప్రజాశక్తి - చెన్నూరు

కడప పట్టణ శివారులోని రాజంపేట-కడప బైపాస్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నూరు మండల పరిధిలోని పాలెంపల్లె వద్ద ఆదివారం తెల్లవారుజామున బైక్‌ను లారీ వేగంగా ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతిచెందారు. వివరాలు.. చెన్నూరు బెస్తకాలనీకి చెందిన బేస్తకాలనీకి చెందిన వడ్లపోయిన వెంకటేశ్వర్లు, సుబ్బమ్మ కుమారుడు సురేష్ (23), రమణ, నాగమ్మ కుమారుడు దినేష్ (26), వెంకటరమణ, రమాదేవి కుమారుడు సుబ్బయ్య (19) అనే యువకులు ఆదివారం ఉదయం ఒంటిమిట్టలో గంగమ్మ జాతరను చూసుకుని బైక్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కడప పట్టణ శివారులోని రాజంపేట-కడప బైపాస్ రోడ్డు వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి చెన్నైకి వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు అక్కడిక్కడే మృతిచెందారు. వీరి ముగ్గిరి తల్లిదండ్రులు చేపల వేటకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపిపి వీర్ల సురేష్‌యాదవ్, కమలాపురం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పుత్తా నరసింహారెడ్డి కడప రిమ్స్‌కు వెళ్లి మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో చెన్నూరు బెస్తకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్థిక నేరగాళ్లను ప్రోత్సహిస్తున్న మోడీ ప్రభుత్వం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ నిర్వహిస్తున్న ప్రచారభేరి మూడవరోజు జడ్‌పి హై స్కూల్ నుంచి ఆర్టీసి బస్టాండ్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు కరపత్రాల పంపిణీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకులు టి.హరేంద్రనాథ్‌శర్మ, డి.ప్రభాకర్ రెడ్డి, క్రిష్ణప్ప, సాంబ శివలు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను మతం పేరుతో మాయం చేస్తూ, కార్మిక శ్రామిక వర్గాన్ని కార్పొరేట్ సంస్థలకు గుమస్తాలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని, రైతులను సైతం కార్పొరేట్ సంస్థలకు కూలీలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దేశంలో ఆర్థిక నేరగాళ్లకు బిజెపి ప్రభుత్వం అండగా నిలబడుతూ దేశ సంపదను పెట్టుబడిదారీ వర్గానికి అప్పగిస్తున్నారన్నారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం సృష్టించిన సంపద, ప్రగతి బిజెపి ప్రభుత్వం దశాబ్ద కాలంలో విధిమేసిందని అన్నారు. మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తుందని, పార్లమెంటు సాక్షిగా రాష్ట్రానికి ఇచ్చిన హామీ ప్రత్యేకహోదా, విభజనహామీలు, రాయలసీమ పారిశ్రామిక కారిడార్, గిరిజన యూనివర్సిటీ, రైల్వే జోన్ ఏ ఒక్క హామీని నెరవేర్చ చేయలేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయరాదని కార్మికులు ఏడు వందల రోజులుగా పోరాటం కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్ట్ అయినప్పటికీ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని పోలవరం ఎత్తును తగ్గించడానికి పూనుకోవడం దుర్మార్గం అన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చేయని కేంద్ర ప్రభుత్వం కర్ణాటకలో ఎగువ భద్ర నిర్మాణానికి కేంద్ర బడ్జెట్లో ఐదు వేల కోట్ల రూపాయలు కేటాయించడం కేవలం పొలిటికల్ డ్రామా అన్నారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు మురళి, సూరి, తిరుమల, రవి, ఓబులేసు, రమణ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

టెన్షన్.. టెన్షన్

- వై.ఎస్. భాస్కర్‌రెడ్డి అరెస్టుతో వెల్లువెత్తిన నిరసనలు
- వైసిపి నాయకులు, కార్యకర్తల ఆందోళన
- సిబిఐకి వ్యతిరేకంగా నినాదాలు
- స్వచ్ఛందంగా దుకాణాల మూసివేత



రాజంపేటలో సిబిఐ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఆదివారం ఉదయం 6.05 నిమిషాలకు సిబిఐ అడిషనల్ ఎస్పీ ముఖేష్ శర్మ ఆధ్వర్యంలో 10 మంది అధికారులు కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి తండ్రి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్ రెడ్డి నివాసానికి సిబిఐ అధికారులు చేరుకుని వెళ్లి భాస్కర్ రెడ్డిని అరెస్టు చేశారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. వైసిపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించారు. సిబిఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వివేకా హత్య కేసులో వై.ఎస్. భాస్కర్ రెడ్డి అరెస్టు, 14 రోజుల రిమాండ్ విధించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈనే పధ్యంలో పులివెందులలో టెన్షన్ వాతావరణం నెలకొంది. పూలంగళ్ల వద్ద వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తుగా భారీ మోహరించారు. పులివెందుల అంతటా బంద్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు.

సిబిఐ అధికారులు రెండు కార్లలో పులివెందులలోని భాస్కర్‌రెడ్డి ఇంటికి చేరుకోవడంతో వైసిపి కార్యకర్తలు, నాయకులు అక్కడి చేరుకుని ఆందోళన చేపట్టారు. కారును మొహరించి సిబిఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భాస్కర్‌రెడ్డి ఆయన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డిని కూడా అదుపులోకి తీసుకున్నారు. 120 - బి నోటీసులు జారీ చేసి సుమారు గంటపాటు పైగా మాట్లాడారు. 120బి, రెడ్ విత్ 301, 201 సెక్షన్ల కింద అరెస్టు చేసినట్లు వై.ఎస్. భాస్కర్ రెడ్డి భార్య లక్ష్మికి మెమో కాపీ అందించారు. అలాగే సమీప బంధువు జనార్దన్ రెడ్డికి సమాచారం ఇచ్చారు. వైఎస్ భాస్కర్ రెడ్డిని సిబిఐ అధికారులు భారీ భద్రత నడుమ రెండు ప్రత్యేక వాహనాలలో హైదరాబాదుకు తరలించారు. వైఎస్ భాస్కర్‌రెడ్డిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి సిబిఐ కోర్టు ఎదుట హాజరు పరిచారు. అంతకు ముందు ఆయనకు బిపి పెరగడంతో ఉస్మానియా ఆసుపత్రిలో వైద్యం చేయించిన తరువాత సిబిఐ కోర్టు ముందు హాజరు పరిచారు. సిబిఐ న్యాయమూర్తి భాస్కర్‌రెడ్డికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. మాజీ మంత్రి వై.ఎస్. వివేకానంద రెడ్డి హత్య కేసులో పులివెందులలో టెన్షన్ వాతావరణం నెలకొంది. రోజురోజుకూ అరెస్ట్ సంఖ్య పెరగడంతో అనుమానితుల్లో కలకలం మొదలైంది. ఇదివరకే ఎర్ర గంగిరెడ్డి, సునీల్ కుమార్ యాదవ్, గజ్జల ఉమా శంకర్ రెడ్డి, షేక్ దస్తగిరి, దేవి రెడ్డి శివశంకరరెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్ అయ్యారు. సిబిఐ దృష్టిలో మరో 10 మందికి పైగా ఉన్నట్లు సమాచారం .ఇంతేకాక మరింత అరెస్ట్‌ అవుతారో తెలియాల్సి ఉంది. మరో వైపు కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డిని కూడా అరెస్టు చేస్తారని జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

సిఎం రాజీనామా చేయాలి : ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి

కడప అర్బన్ : వివేకా హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డిని సిబిఐ అధికారులు అరెస్టు చేసినందుకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాజీనామా చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు బిల్టప్ వద్ద ఉన్న పుత్త ఎస్టేట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్య సమయం సీఎం జగన్ చేశారని విమర్శించారు. కుటుంబ సభ్యులు హత్య చేసి నేరాన్ని చంద్రబాబు నాయుడు పై వేసేందుకు కుట్ర పన్నారని విమర్శించారు. సూత్రధారులను సిబిఐ త్వరలో అరెస్టు చేస్తున్నారని.తెలిపారు. హత్య కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం వైయస్ భాస్కర్ రెడ్డి చేశారని చెప్పారు. రాజకీయ లబ్ధి కోసం వివేకా హత్య చంద్రబాబునాయుడు చేయించారని అన్న సీఎం జగన్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

భాస్కర్ రెడ్డి అరెస్ట్ అక్రమం : ఆకేపాటి

రాజంపేట అర్బన్ : వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టు అక్రమమని ఉభయ జిల్లాల జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసినందుకు సిబిఐ తీరుకు నిరసనగా ఆదివారం వైఎస్‌ఆర్‌సిపి శ్రేణులతో కలిసి ఆర్‌అండ్‌.బి బంగ్లా వద్ద నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్‌లో సిబిఐ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాధారమైన ఆరోపణలతో భాస్కర్ రెడ్డిని అరెస్టు చేయడం దారుణమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని, ఈ పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని కలెక్టర్ గిరీష ఆకాంక్షించారు. ఆదివారం సాయంత్రం రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు, ఆరాధన ప్రార్థనలు, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించేదే రంజాన్ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. మైనార్టీ సోదరులు ఈ మాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారన్నారు. ముస్లిం సోదరులందరూ 30 రోజులు పాటు ఎంతో నిష్టగా ఉపవాసం ఉండి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ అల్లా మన్ననలు పొందాలన్నారు. రాబోయే రోజులలో హిందూ, ముస్లిం సోదరులు కలిసిమెలిసి జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాసం ఉండి మూడు పూటలా నమాజ్ చేసుకోవడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఈ రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని అల్లాను ప్రార్థిస్తున్నామన్నారు. ఇఫ్తార్ విందుకు హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు, ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌పి గంగాధర్ రావు, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒ రంగస్వామి, మైనారిటీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు బేపారి అహమ్మద్‌ఖాన్, జిల్లా మైనార్టీ జిల్లా అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసులను నిర్లక్ష్యం చేయొద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి-కలకడ

మిస్సింగ్ కేసులను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన చేధించాలని ఎస్‌పి గంగాధరరావు సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ సందు క్రింది స్థాయి ఉద్యోగుల నుండి విధులు నిర్వహిస్తే ఉన్నత అధికారులకు మంచి పేరు ప్రతిష్ట వస్తాయన్నారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఉన్న కాంప్లెక్స్ గదులను, సిఐ కార్యాలయాన్ని పరిశీలించినట్లు తెలిపారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తినే వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ఎస్‌బి రాజ్ కమల్, సిఐ నాగేంద్ర, ఎస్‌ఐ తిప్పేస్వామి, ఎస్‌బి హెడ్ కానిస్టేబుల్ చంగల్ రాయులు, ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సాహిత్య నిర్మాత 'కందుకూరి'

రాజంపేట అర్బన్ : కవిగా, రచయితగా, నాటక కర్తగా, సంఘ సంస్కర్తగా పేరొందిన కందుకూరి వీరేశలింగం పంతులు ఆధునిక సాహిత్య నిర్మాత అని తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. తెలుగు భాషా సంరక్షణ సమితి రాజంపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక జువ్వి బజారులోని సరస్వతి విద్యా మందిరంలో కందుకూరి వీరేశలింగం పంతులు 175వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగనపల్లి వెంకటరమణ మాట్లాడుతూ తాను నమ్మిన సత్యానికి, సిద్ధాంతానికి లోబడి రచయితగా, పత్రికా సంపాదకునిగా, నాటక కర్తగా, వ్యాసకర్తగా, సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి సంఘసంస్కర్తగా సమ సమాజ నిర్మాణానికి కృషి చేసిన ధైర్యశాలి కందుకూరి అని ఆయన పేర్కొన్నారు. సమితి రాజంపేట మండల శాఖ అధ్యక్షులు బొప్పా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ కందుకూరి వారి రచన వ్యాసంగం ఒక మహాసముద్రం వంటిదని, అభినవ తిక్కన బిరుదాంకితులు కందుకూరి చిన్నప్పటి శతకాలు రాసిన మనుడని చెప్పారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు బి.వి.నారాయణ రాజు, రాయుడు, విద్యార్థులు ఉష, ప్రియాంక పాల్గొన్నారు.

రమణయ్యకు జ్యోతిరావుపూలే ఎక్సలెన్స్ అవార్డు

రాజంపేట అర్బన్ : పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి డిఇఒ. శేఖర్ అధ్యక్షతన రాష్ట్రస్థాయిలో మహాత్మ జ్యోతిరావుపూలే ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని తిరుపతి పట్టణం లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణంలో నిర్వహించారు. రిటైర్డ్ హైకోర్టు జడ్జి బి.చంద్ర చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించి అవార్డులను బహూకరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించగా, మండలంలోని నారపురెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.రమణయ్య జ్యోతిరావు పూలే అవార్డును అందుకున్నారని యుటిఎఫ్ నాయకులు వెంకటసుబ్బయ్య తెలిపారు.

నేడు యథావిధిగా 'స్పందన'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన అర్జీల స్వీకరణ జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక కేంద్రాధికారి బి.శివ శంకర్ రెడ్డి తెలియజేశారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆదివారం పట్టణంలోని తిరుపతి రహదారిలోని గ్రీన్ పార్క్ అపార్ట్మెంట్ యజమానులకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేసి వారికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు పాటించాల్సిన మెళకువలను వివరించారు. గ్రీన్ పార్క్ అపార్ట్మెంట్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు 08565 240299, 99634 79554కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బి.సత్యరాజు, బి.సి.ఆర్ సుబ్రహ్మణ్యం, పి.రవీంద్రబాబు, శివయ్య, సి.నాగూర్ బాషా, కె.రాజేష్, జె.శివ శంకర్, సి.రవీంద్ర బాబు, జి.చక్రవర్తి, యు.రాజన్న పాల్గొన్నారు.

అధునాతన హంగులతో నిర్మాణాలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అధునాతన హంగులతో రాయచోటి పట్టణంలోని డైట్ హాస్టల్ ప్రాంగణంలో పార్క్, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణాలను చేపడుతున్నామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం డైట్ హాస్టల్ ప్రాంగణంలో జరుగుతున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వాకింగ్ ట్రాక్, పార్క్, చిల్డ్రన్ పార్క్, యోగ కేంద్రం, ఓపెన్ జిమ్ తదితర నిర్మాణాలను చేపడుతున్నామని చెప్పారు. ప్రాంగణంలోకి ఆకతాయిలు బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, వ్యవసాయ సలహామండలి సభ్యులు దిన్నెపాటి రవిరాజు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో కంటిని పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్యానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని లైన్స్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదాశివరెడ్డి, పాపిడి మహేష్ గుప్త, ఈశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రతి 3వ ఆదివారం జరిపే కార్యక్రమంలో భాగంగా ఈ ఆదివారం పీలేరులో చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరంలో, వివిధ రకాల కంటి చూపు సమస్యలతో బాధపడుతూ వచ్చిన 120 మందికి, తిరుపతి శ్రీవేంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాల బృందం వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి ఉచిత కంటి అద్దాలు, మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వారిలో కంటి శుక్లాలతో బాధపడుతున్న 25 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ కోసం ఎంపికైన వారిని తిరుపతిలోని అరవింద్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయించి, తిరిగి వారిని పీలేరుకు చేర్చడం జరుగుతుందని అన్నారు. వారికి ఉచిత భోజన, ప్రయాణ, కంటి అద్దాలు కూడా ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ ప్రసాద్, సత్యం రెడ్డి, శేఖర్ రెడ్డి, మహేష్, సురేంద్ర రెడ్డి, లాయర్ జగన్మోహన్ రెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు. **రాయచోటి:** మండల పరిధిలోని చెన్న ముక్కపల్లె గ్రామంలో లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 34 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంతో పాటు జిల్లాపరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, కలికిరి, కలకడ, గుర్రంకొండ, పెద్దమండెం, యర్రావారిపాలెం, కెవిపల్లి, కదిరి, ఎన్.పి.కుంట తదితర ప్రాంతాల నుండి వచ్చిన 80 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో అర్హులైన 34 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌భాష, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఎంపిటిసి రామ చంద్రా రెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు,భార్గవి, మహాలక్ష్మి, మూలిరాజగోపాల్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

నందలూరు : అనాథ మృతదేహానికి నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి రైల్వే పండ్‌హౌస్ సమీపంలో యాచకుడు మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తికి ఎవరు లేకపోవడంతో సర్పంచ్ జంబుసూర్యనారాయణ ఆధ్వర్యంలో సమీపంలోని చెయ్యేరు నదిలో హిందూ సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య క్రమంలో ఆకేపాటి చిన్నసిద్ధారెడ్డి, నంద యాదవ్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం

రాజంపేట అర్బన్ : వైభియన్ పల్లెలో వెలసి ఉన్న గణపతి అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఆరవ వార్షికోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పోతుగుంట రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అప్పలాచార్య, అన్నెకుతో విజయ స్వామి వారి బృందం చే ప్రత్యేక పూజలు, గణపతిపూజ, నవగ్రహపూజ, హోమం, అభిషేకం, ఆకుపూజ, వడమాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాటు

పీలేరు : పీలేరు ఆర్‌టిసి నెల్లగుట్టలోని ఫాతిమా మసీదులో ఉపాధ్యాయులు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఆదివారం రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసాలు ఆచరించే ముస్లిం ఉపాధ్యాయులు, ఉద్యోగుల కోసం ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలలో వారికి ఫలహారాలను సమకూర్చారు. ప్రత్యేక ప్రార్ధనల అనంతరం అందరికోసం విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు పోతంశెట్టి రమేష్, రహంతబాష, శెట్టి సుబ్రమణ్యం, వి.రామచంద్ర, సుధాకర్, పొకల తాతయ్య, కె.వి.పల్లి ఎంఇఒ పి.రెడ్డి భాష, ప్యారూఖాన్ పాల్గొన్నారు. **ఓబులవారిపల్లి :** మండల పరిధిలోని మంగంపేట ఆర్‌ఆర్ సెంటర్‌లో ఆదివారం రైల్వే బోర్డ్ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక భావన ఉప్పొంగిపోగా సౌభ్రాతృత్యం వెల్లువైంది. ఈ ఇఫ్తార్ విందులో 2000 మంది ముస్లిం సోదరులు పాల్గొని విందును స్వీకరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారి మృతికి వ్యాక్సిన్ కారణం కాదు

కంభంవారిపల్లి : మండలంలోని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ తనిఖీ చేశారు. కేంద్రంలో వ్యాక్సిన్లు భద్రపరుస్తున్న విధానం, రిజిష్టర్లు పరిశీలించారు. వ్యాక్సిన్ వేస్తున్న తీరుపై సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మిరెడ్డిగారిపల్లె గ్రామంలో శనివారం గ్రామ ఆరోగ్య కార్యకర్త రోటీన్ ఇమ్యునైజేషన్ సెషన్ లో భాగంగా వ్యాక్సినేషన్ నిర్వహించినదని, ఆ సెషన్‌లో వ్యాక్సిన్ తీసుకున్న రెండు నెలల మగ బిడ్డ వ్యాక్సిన్ కారణంగా మృతి చెందినట్లు గ్రామంలో వదంతులు వ్యాపించాయని అన్నారు. ఈ సంఘటన పై వైద్యాధికారి డాక్టర్ శ్యామల ఆధ్వర్యంలో వైద్య బృందం ఆదివారం గ్రామాన్ని సందర్శించి తల్లిదండ్రులను, గ్రామస్తులను విచారించినట్లు తెలిపారు. ఆదివారం వేకువ జామున నాలుగు గంటల వరకు కూడా బిడ్డ బాగున్నట్టు తెలిసిందన్నారు. ఆ సమయంలో తల్లి పాలు త్రాగించి బిడ్డను పడుకోబెట్టి రంజాన్ మాసం కావడంతో ఇతర పనులకు ఉపక్రమించారని అన్నారు. ఆరు గంటల సమయంలో బిడ్డను గమనించగా అప్పటికే బిడ్డ కదలికలు లేకుండా ఉన్నట్లు గుర్తించి, పీలేరు లోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్ళగా వైద్యులు పరిశీలించి బిడ్డ మృతి చెందినట్లు తెలిపారన్నారు. వ్యాక్సిన్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కలగలేదని, బిడ్డ మృతికి మిల్క్ ఆస్పిరేషన్ కారణం కావచ్చునని ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ సామాజిక ఆరోగ్య అధికారి నారాయణ, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది భాగ్యలక్ష్మీ, రమాదేవి, కృష్ణయ్య, కృష్ణమ్మ, పురుషోత్తం, మెమిన్ తాజ్, రమణి, రహీన బేగం, సరస్వతి, గీతారాణి పాల్గొన్నారు.

రైళ్లు ఆగకపాయే.. క్రూ కూడా పోయే..!

మరో హస్తవరం కానున్న నందలూరు రైల్వేస్టేషన్
శాపంలా మారిన అధికార, ప్రతిపక్ష పార్టీల కుమ్ములాటలు

ప్రజాశక్తి-నందలూరు

బ్రిటిష్ కాలం నుంచి గుంతకల్ డివిజన్‌లోనే ఓ వెలుగు వెలిగిన నందలూరు రైల్వేస్టేషన్ ఇంకో ఏడాది కాలంలోనే హస్తవరం రైల్వే స్టేషన్‌లా మారనుంది. కరోనా కారణంగా రెండు ప్యాసింజర్ రైలు తప్ప ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల అన్నిటిని తీసివేయడంతో ఇప్పటికే రైల్వే స్టేషన్ వెలవెలబోతుంది. రైల్వే కేంద్రంలో ఉన్న ఒక్కగానొక్క క్రూ బుకింగ్ లాబీ (డ్రైవర్లు, గార్డులు చేంజింగ్) కూడా ఏడాది కాలంలోగా పూర్తిస్థాయిలో ఎర్రగుంట్లకు తరలిపోవడానికి ఆ ప్రాంతానికి చెందిన అధికారి చక్రం తిప్పితే ఇక్కడి అధికార, ప్రతిపక్ష నాయకుల కుమ్ములాటలతో నందలూరు రైల్వే స్టేషన్ నిర్మానుష్యంగా మారనుంది. రైల్వే పరిశ్రమ ఏర్పాటు కోసం, రైళ్ల నిలుపుదల కోసం కేంద్ర మంత్రులు, అధికారులకు మన నాయకులు ఇచ్చిన అర్జీలు చిత్తు కాగితాలయ్యాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిటిష్ కాలంలోనే గుంతకల్లు, చెన్నై మార్గమధ్యంలో సెంటర్ పాయింట్‌గా అన్ని సౌకర్యాలు ఉన్న నందలూరును అప్పటి బ్రిటిష్ అధికారులు గుర్తించి లోకోషెడ్ ను నిర్మించారు. కాలక్రమమైన డీజిల్ ఇంజన్లు రావడంతో మరొక పరిశ్రమ ఏర్పాటు చేస్తామని రైల్వే అధికారులు హామీనిచ్చి లోకోషెడ్‌ను మూసి వేయడంతో వేల మంది కార్మికులు, కుటుంబాలు ఇక్కడి నుంచి తరలి వెళ్లిపోయారు. దీంతో రైల్వే ఆస్తులు,



క్రూ బుకింగ్ లాబీ కార్యాలయం



నందలూరు రైల్వే స్టేషన్

క్వాటర్స్ పనికి రాకుండా పోయాయి. నూతన పరిశ్రమ కోసం ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తే జిల్లా స్థాయి నుంచి, కేంద్ర స్థాయి వరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు నూతన పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న హామీలు నీటి మీద రాతలయ్యాయి. రైళ్ల నిలుపుదల కోసం ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడితే అధికార, ప్రతిపక్ష పార్టీలు గ్రూపులుగా విడిపోయి ఉద్యమాన్ని నీరుగార్చరని ప్రజలు చర్చించు కుంటున్నారు.

డ్రైవర్లు, గార్డులు ఎర్రగుంట్లకు తరలింపు

నందలూరు రైల్వే కేంద్రంలో మిగిలి ఉన్న ఒక్కగానొక్క క్రూ బుకింగ్ లాబీ (డ్రైవర్లు, గార్డులు చేంజింగ్) ఆఫీస్‌లో పనిచేస్తున్న సిబ్బందిని, డ్రైవర్లను, గార్డులను ఈనెల 12 నుంచి ఎర్రగుంట్లలో ప్రారంభమైన క్రూ బుకింగ్ ఆఫీస్ కు ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యి తరలి వెళ్లారు. నందలూరు క్రూ బుకింగ్ లాబీ ఆఫీస్‌లో 87 మంది డ్రైవర్లు, 144 మంది అసిస్టెంట్ డ్రైవర్లు, 51 మంది గార్డులు పనిచేస్తున్నారు. గత నెలలో 13 మంది డ్రైవర్లు,18 మంది అసిస్టెంట్ డ్రైవర్లకు, ఇటీవల 21 మంది గార్డులకు బదిలీ ఉత్తర్వులు అందాయి. గత నాలుగు రోజుల నుంచి డ్రైవర్లు, గార్డులు రోజుకు ముగ్గురు నలుగురు చొప్పున రిలీవై ఎర్రగుంట్లకు తరలి వెళ్తున్నారు. ఆరు నెలల్లో ఇక్కడ ఉన్న సిబ్బంది అంత ఎర్రగుంట్లకు తరలిపోనున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్వార్ధ రాజకీయాలు మాని నందలూరు ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచేలా, క్రూ బుకింగ్ లాబీ ఇక్కడి నుంచి తరలిపోకుండా రైల్వే అభివృద్ధికి కృషి చేస్తే వచ్చే ఎన్నికలే కాకుండా జీవితాంతం ప్రజలే బ్రహ్మరథం పడతారని అంటున్నారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పీలేరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం-2020ని రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హరి ప్రసాద్, జాబీర్ డిమాండ్ చేశారు. యుటీఎఫ్ బేరర్ల సమావేశం ఆదివారం శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి అంశం కేంద్రీకరణ, వ్యాపారీకరణ, మత తత్వీకరణ లక్ష్యంగానే జరుగుతున్నాయని అన్నారు. ప్రతి విషయంలోనూ కేంద్ర ప్రభుత్వ విపరీత జోక్యం వల్ల సమాఖ్య స్ఫూర్తి, రాష్ట్రాల హక్కులు హరించబడతాయన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు. పాఠశాలల విలీనం పేరుతో పాఠశాల విద్యను, విదేశీ విశ్వ విద్యాలయాల ప్రాంగణాల పేరుతో ఉన్నత విద్యను, సెల్ఫ్ ఫండింగ్ పేరుతో సాంకేతిక, వృత్తి విద్యలను ప్రభుత్వ రంగంలో నిర్వీర్యంచేసి కార్పొరేట్లకు అధిక లాభాలు చేకూర్చే సాధనంగా ఎన్ఇపి-2020 ఉందని చెప్పారు. దీన్ని తక్షణమే రద్దు చేసి రాజ్యాంగ విలువలతో కూడిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. పాఠశాల పర్యవేక్షణ ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేసే విధంగా కాకుండా, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధించేందుకు సహకరించేదిగా ఉండాలని, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి మినహాయించాలని, ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. సిపిఎస్ రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాలని, పెండింగులో ఉన్న డిఎలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, గిరిజన సంక్షేమ, ఎయిడెడ్, మున్సిపల్, మోడల్ స్కూళ్ళు, కెజిబివి పాఠశాలల్లోని ఉపాధ్యాయుల, సిఆర్‌ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు శివారెడ్డి, కోశాధికారి బి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు సుధాకర్ నాయుడు, పురం వెంకటరమణ, సివి రమణ మూర్తి, భాస్కర్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, అక్రం బాష ఉపాధ్యాయ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ బేరర్ల సమావేశంలో పాల్గొన్న నాయకులు

అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి



రాజంపేట : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక కేంద్రాధికారి పి.శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆదివారం పట్టణంలోని తిరుపతి రహదారిలో గల గ్రీన్‌పార్క్ అపార్టుమెంట్‌లోని యజమానులకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేసి, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాల సంభవించినప్పుడు ఎలా రక్షించుకోవాలో డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు 08565 240299, 99634 79554 నెంబర్లను సంప్రదించి సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బి.సత్యరాజు, బి.సి.ఆర్‌సుబ్రహ్మణ్యం, పి.రవీంద్రబాబు, శివయ్య, సి.నాగూర్ బాష, కె.రాజేష్, జె.శివ శంకర్, సి.రవీంద్ర బాబు, జి.చక్రవర్తి, యు.రాజన్న పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా కేంద్ర అగ్నిమాపక అధికారి కే.మాబుసుభాన్ ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ చేసి మార్కెట్ వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి, మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యల గురించి చైతన్యం కల్పించారు. ఏదైనా ప్రమాదం జరిగిన ఎడల అగ్నిమాపక కేంద్రమునకు సమాచారము అందించాలని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పి.ఆనంద్ లీడింగ్, ఎస్.అబ్దుల్ అమిత్, రెడ్డి శేఖర్, ఎండి.మురళి, ఎస్.చిన్నబాబు , పి.రాజేంద్ర పాల్గొన్నారు. **పీలేరు :** మన పరిసరాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా వాటిని నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్ కుమార్ తెలిపారు. అగ్నిమాపక అధికారి డి. సుబ్బరాజు ఆధ్వర్యంలో ఆదివారం పీలేరు-కడప మార్గంలోని శ్రీదుర్గా అపార్ట్‌మెంట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో స్థానిక దుర్గా గ్యాస్ ఏజెన్సీ బి.అమరేంద్ర నాయక్ హాజరయ్యారు. **లక్కిరెడ్డిపల్లి :** జిజి రాచపల్లి ప్రజలకు అగ్ని ప్రమాదాల గురించి అగ్నిమాపక అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాల పట్లఅప్రమత్తంగా ఉండి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కార్య క్రమానిలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జెసి బాల హుస్సేన్ పాల్గొన్నారు. **ములకలచెరువు :** ప్రతి ఒక్కరు అగ్నిమాపక సేవలు వినియోగించుకోవాలని అగ్నిమాపక లీడింగ్ ఫైర్ మ్యాన్ కృష్ణయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఉమాశంకర్ కాలనీలో గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణయ్య, గణేష్‌కుమార్, వీరభద్ర రెడ్డి పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** అగ్ని ప్రమాదాల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక తిరుపతి రోడ్డులోని ఇందిరమ్మకాలనీలో మహిళలకు అగ్నిమాపక అధికారులు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, మంటలను ఏ విధంగా ఆర్పాలి తదితర వాటిపై అవగాహన కల్పించారు. అదే విధంగా వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా గ్యాస్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని మహిళలు గ్యాస్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అపార్ట్‌మెంట్లలో జరిగే ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బహుళ అంతస్తుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను సురక్షితంగా ఎలా తీసుకొస్తారనే దానిపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది బాబయ్య, శ్రీనివాసులు, రాజగోపాల్ నాయక్, కిరణ్‌బాబు, రవి, ఇమ్రాన్, చైతన్య, శివశంకర్, భాస్కర్ పాల్గొన్నారు.

యుగపురుషుడు వీరేశలింగం

వాల్మీకిపురం : సమాజంలో పాతుకుపోయిన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఆ జన్మాంతం పోరాడిన యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం పంతులని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. ఆదివారం తెలుగుజాతి నవయుగ వైతాళికుడు, ఆధునిక సమాజ పితామహుడు కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం వితంతు వివాహాలను ప్రోత్సహించడం, బాల్య వివాహాలను నిరోధించడానికి విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమరనాథ రెడ్డి, నాగరాజ, తారాదేవి,చెంగయ్య, నాగేశ్వర పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు టిడిపి ఇన్‌ఛార్జి వై.జిలానీబాషా తెలిపారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు బస్టాండ్ ప్రాంగణంలోకి వచ్చే ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్ర ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చంద్రమోహన్ (చిట్టిబాబు), బరకం శ్రీనివాసులురెడ్డి, వై.శేఖర్‌నాయుడు, రామాంజులు, కరీముల్లా, ఇమ్రాన్, ఇర్ఫాన్, ఖాజాహుస్సేన్, జాఫర్ హుస్సేన్, నౌషదబాషా, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30న 108 భక్తి గీతాల కార్యక్రమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మన సంస్కృతి కళా సంస్థ వారి ఆధ్వర్యంలో స్థానిక సొసైటీ కాలనీలోని శ్రీ రామాలయంలో ఏప్రిల్ 30 వ తేది జరుగు108 భక్తి గీతాలు కార్యక్రమం జయప్రదం చేయాలని మన సంస్కృతి కళా సంస్థ ప్రదాన కార్యదర్శి కలకట రెడ్డప్ప కోరారు. ఆదివారం ఉదయం శ్రీరామాలయం సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశలో ఆయన మాట్లాడుతూ గతకాలంలో మారుమూల పల్లె ప్రజలు శ్రమైక జీవన సౌందర్యాన్ని పొందుతూ పాడుకున్న మన సంస్కృతి, సాంప్రదాయాలు, జానపదకళలు, భక్తి, భజన పాటలు రోజు రోజుకు కనుమరుగవు తున్నాయని అన్నారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలలోని గాయకులు, భక్తులు, కళాభిమానులు, కళా పోషకులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. మన సంస్కృతి కళా సంస్థ గౌరవాధ్యక్షులు జానం గంగిరెడ్డి, కళా వాహిని వ్యవస్థాపకులు వేమ నారాయణ, శ్రీ రామ సేవా సంఘం ట్రస్ట్ అధ్యక్షులు ఎస్.వి రాఘవన్, ప్రధాన అర్చకులు జి.నరసింహాచార్యులు, సహ అర్చకులు శ్రీకర్ స్వామి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

కలికిరి : జ్యోతిబాపూలే ఐదవ తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. 2023-24 విద్యా సంవత్సరానికి గాను కలికిరి జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ఐదవ తరగతి అడ్మిషన్ల కోసం పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపల్ సోమశేఖర్ తెలిపారు. ప్రవేశ పరీక్షకు 140 మంది విద్యార్థులకు 118 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.



కరస్పాండెంట్‌ను సన్మానిస్తున్న అతిథులు

'లక్ష్యసాధనకు కష్టపడి చదవాలి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు తమకంటూ ఓ లక్ష్యం ఎంచుకోని లక్ష్యం సాధించేందుకు కష్టపడి చదవాలని ఎస్‌పిడిసిఎల్ చీఫ్ సెక్రటరీ కృష్ణరెడ్డి, ఎస్‌వి యూనివర్సిటీ డీన్ సిడిసి, ప్రిన్సిపల్ సిహెజ్ అప్పారావులు అన్నారు. ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో విశ్వహిత డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు కళాశాల కరస్పాండెంట్ ఉదయ భాస్కర్, వివేకానంద ప్రసాద్‌లు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌పిడిసిఎల్ చీఫ్ సెక్రటరీ కృష్ణ రెడ్డి, పుంగనూరు ఇఇ విజయన్, మదనపల్లె ఇఇ రాజశేఖర్ రెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ రాంమూర్తిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, తల్లితండ్రులు గురువులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు వ్యవహరించాలని అన్నారు. ముఖ్య అతిథులను దుశ్శాలువాతో సత్కరించి మోమెంటోలు అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్షణగోడ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రక్షణ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి-చిట్వేలి

గుంజను నదిలో రక్షణ గోడ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు భూమిపూజ చేశారు. గతంలో మార్నింగ్ వాక్ కార్యక్రమంలోభాగంగా నదీ పరిసరాలు కోతకు గురైనప్పుడు ప్రజలు అవస్థలు పడుతున్న విషయాన్ని రాష్ట్రకార్యవర్గసభ్యులు మలిశెట్టివెంకటరమణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకపోయి రూ.2.60 కోట్లు మంజూరు చేయించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉమామహేశ్వరరెడ్డి, కాంట్రాక్టర్ పాటూరు శ్రీనివాసులురెడ్డి, కన్వీనర్ చేవ్వ శ్రీనివాసులు రెడ్డి, ఎల్‌వి.మోహన్ రెడ్డి, ఎంపిపి చంద్ర, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వైసిపితోనే ఆర్థిక ప్రగతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వైసిపి పాలనలో ప్రతి కుటుంబంలో ఉన్న ఆర్థిక స్థితులు మారి ఆనందంగా ఉన్నారని వైసిపి నాయకులు పేర్కొన్నారు. మా నమ్మకం నీవేజగన్- మా భవిష్యత్తు జగనన్నే కార్యక్రమాన్ని కన్యమడుగు పంచాయతీలో సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపిటిసి సభ్యులు మహేష్ మల్లెకొండ చైర్మన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన తీరు వివరిస్తూ వారి అభిప్రాయాన్ని సేకరించి వారి అనుమతితో ఇంటికి స్టిక్కర్‌ను అతికించారు. కార్యక్రమంలో నాయకులు రామశంకర్ రెడ్డి, మద్దిరెడ్డి, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణ నేర్పే పర్వదినం రంజాన్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ధర్మం, దానం, క్రమశిక్షణ నేర్పే పర్వదినం రంజాన్ పండుగ అని ఆల్ మదద్ ట్రస్టు అధ్యక్షులు నయీముద్దీన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని నాయక్‌వీధి దర్గాలో నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లిం కుటుంబాలకు సహాయం చేయడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. నిత్యవసర వస్తువులతో పాటు బియ్యం, తదితర వాటిని ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నసీముల్లా సాహెబ్, సందాని, ఖలందర్, తాహీర్, కిజర్, షఫి, ఇర్ఫాన్ పాల్గొన్నారు.



నూతన జెసిగా గణేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ



కడప : వైఎస్ఆర్ జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా జి.గణేష్ కుమార్ ఆదివారం అధికార భాధ్యతలు చేపట్టారు. స్థానిక కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్లో ముందుగా పురోహితుల ఆశీర్వచనాలు స్వీకరించిన అనంతరం బాధ్యతలను స్వీక రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తనకు అప్పజెప్పిన విధులను, బాధ్యతలను వందశాతం పూర్తి చేసేలా పనిచేస్తూ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తా మన్నారు. కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశానుసారం ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసు కుంటామన్నారు. ఏవైనా సమస్యలుంటే ప్రజా ప్రతినిధులు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

'పెట్రో' పోట్లు!

- 8 ఏళ్లగా బిజెపి సర్కారు హేళన
- 100 దఫాలకుపైగా పెట్రో ధరల పెంపు




ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలో సుమారు 12 లక్షలకుపైగా వాహనాలు ఉన్నాయి. అత్యధికంగా మో టార్‌బైక్‌లు, ఆటోలు, లారీలు, ట్రాక్టర్లు ఉన్నాయి. సుమారు లక్షకుపైగా మోటార్‌బైక్‌లు, 25 వేలకుపైగా ఆటోలు, ఇతర వాహనాలు ఉన్నాయి. వీటిపైనే నిరుద్యోగ యువత, పేద, మధ్య తరగతి ప్రజానీకం ఆధారపడి జీవనం సాగిస్తోంది. 2014 సంవత్సరంలో రూ.62 నుంచి 2023 నాటికి లీటర్ పెట్రోల్ రూ.111 డీజిల్ రూ.98.89 చేరుకోవడం ఆందోళన కలిగించింది. 2014 నుంచి కేంద్రం ధరల దరవు మోగిస్తూనే ఉంది. ఒకవైపు కరోనా విజృంభణ, మరోవైపు ఉపాధి కరువై నిరుద్యోగం ప్రబలిన పరిస్థితుల్లోనూ పెట్రో, డీజిల్ ధరలను పెంచి బిజెపి సర్కారు తన నిజరూపాన్ని బయట పెట్టుకుంది. 2018 సంవత్సరంలో జులై నుంచి నవంబర్ వరకు రోజు మార్చి రోజు చొపన వరుసగా పెరుగుతున్న పెట్రో, డీజిల్ ధరలతో సామాన్యులు బెంబేలెత్తిపోవడం ఆందోళన కలిగించింది. జిల్లాలో ప్రతిరోజూ పెట్రోల్ నాలుగు లక్షల లీటర్లు, డీజిల్ 5.50 లక్షల లీటర్లు వినియోగం అవుతోంది. పెట్రోల్ ధర రూ.111.11 చొప్పున 4.5 కోట్లు, డీజిల్ రూ. 5.5 కోట్ల చొప్పున వసూలు అవుతోంది. 2014లో యుపిఎ హయాంలో పెట్రోల్ రూ.62 నుంచి రూ.67, డీజిల్ సుమారు రూ.35 చొప్పున ఉన్నప్పుడు రూ.2.5 కోట్ల చొప్పున పెట్రోల్, డీజిల్ రూ.1.5 కోట్ల చొప్పున ఆదాయం లభించేది. ఎన్‌డిఎలోని బిజెపి సర్కారు హయాంలో పెట్రో ఉత్పత్తుల ధరలు ఆకాశానికి అంటడం తెలిసిందే. ఫలితంగా రోజుకు రూ.4.5 కోట్ల పెట్రో ఆదాయం, 5.5 కోట్ల డీజిల్ ఆదాయం లభిస్తోంది. రెట్టింపు స్థాయిలో ధరలను రెట్టింపు స్థాయిలో పెంచేసింది. జిల్లా నుంచి వందల కోట్లలో ఆదాయమూ లభిస్తోంది. గతేడాది ఫిబ్రవరి నుంచి రష్యా-యుక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా క్రూడాయిల్ ధరలపై అమెరికా ఆంక్షలు విధించింది. 20 నుంచి 30 శాతం తగ్గింపు ధరలతో రష్యా తన చమురును ఇండియాకు విక్రయిస్తోంది. 90 డాలర్ల క్రూడాయిల్ బ్యారల్ ధరల్లో సుమారు 20 నుంచి 30 డాలర్లకు తక్కువగా విక్రయిస్తోంది. పెట్రో వినియో గదారులకు ధరల తగ్గింపుల్లో ఊరట లభించ కపోవడం ఆందోళన కలిగిస్తోంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినప్పుడు అంతర్జా తీయంగా ధరలు పెరగడం వల్ల పెట్రో ధరలు పెరగడం అనివార్యమని సెలవిచ్చిన కేంద్ర మంత్రులు అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పుడు తగ్గించకపోవడంలోని ఆంతర్యమేమిటో చెప్పడం లేదు. 2020, 2021 సంవత్సరాల్లో ఒక దశలో బ్యారల్ చమురు 25 డాలర్లకు పడిపోయింది.



కేంద్రంలోని బిజెపి సర్కారు మధ్య తరగతి జేబులకు భారీగా చిల్లులు పెట్టింది. 2014 నుంచి నేటి వరకు ఎనిమిదేళ్ల వ్యవధిలో సుమారు 75 నుంచి 100 దఫాలకుపైగా పెట్రో, డీజిల్ ధరలను పెంపు రూపంలో కాజేసింది. 2014 యుపిఎ హయాంలో పెట్రోల్ రూ.67 ఉండగా, కేంద్రంలోని బిజెపి సర్కారు హయాంలో ఎనిమిదేళ్లలో సుమారు రెట్టింపు చేసింది. పెట్రోల్ ధర రూ.111.11, డీజిల్ ధర రూ.43 నుంచి రూ.90 చేరుకుంది. యుపిఎ హయాంలోని ధరలకు రెట్టింపునకు మించిన స్థాయిలో పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి కడప జిల్లాపై రోజుకు యుపిఎ హయాంలో సుమారు రూ.2.5 కోట్లు ఉన్నట్లు అంచనా. ఎన్‌డిఎ హయాంలో పెట్రోల్‌పై రూ.4.5 కోట్లు, డీజిల్‌పై రూ.5.5 కోట్ల చొప్పన ఎనిమిదేళ్లకు సుమారు రూ.వందల కోట్ల భార పడింది. ఉత్తరాధి రాష్ట్రాల్లో ఎన్నికలు ఉంటే ధరల పెంపు జోలికి వెళ్లదు. లేకపోతే ధరల పెంపునకు అడ్డూ అదుపు లేకుండా పెంచుంతోంది.


సామాన్యులపై కేంద్రం దోపిడీ



ఒక వస్తువు ఉత్పత్తికి సంబ ంధించిన ముడిసరుకు ధరలు తగ్గితే దానికి అను గుణంగా మార్కెట్‌లో ఆ వస్తువు ధర తగ్గాలి. ఇంధన ధరల తగ్గినా ప్రజలపై భారాలు తగ్గిం చడం లేదు. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిం చకుండా సామాన్యుడి జేబును గుల్ల చేస్తూ దోపిడీ చేస్తోంది.

- డి.వెంకటేష్, వాహనదారుడు, పోరుమామిళ్ల

పెట్రోల్ ధరలు తగ్గించాలి



సామాన్య ద్విచక్ర వాహనదారులపై బిజెపి ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచి అధిక భారాలు మోపుతున్నారు. పెట్రోల్ ధరలు తక్షణమే తగ్గించాలి. ప్రభుత్వం పెట్రోల్ ధరలు తగ్గించి సామాన్యులపై భారం తగ్గించాలి

జి.బాబు నిరంజన్‌రెడ్డి, వాహనదారుడు వల్లూరు.

పేదలకు పెను భారం



మోడీ ప్రభుత్వం పేదల పాలిట పెనుభారంగా తయారైంది. పేదలను, ధనికులను ఒకే గాటికి కట్టేస్తూ గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. స్కూటర్లు అమ్ముకొని సైకిళ్లకొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి.

- టి.హరికృష్ణ, వాహనదారుడు, రాజంపేట.

పెట్రో భారాన్ని అరికట్టాలి



రోజురోజుకీ పెరుగుతూన్న పెట్రోలు ధరలు సామాన్యులకు అదనపు భారం. పెట్రోలు ధరల బాదుడుతో చేతి చమురును కూడా వదిలిం చుకోవలసి వస్తోంది. మధ్య తరగతి వారికి ఈ పెట్రోలు ధరల వాత తట్టుకోలేనిదిగా ఉంది.

-ఎన్.రఘునాథ్, వాహనదారుడు, పీలేరు.

నెత్తురోడిన రహదారులు

- ఉమ్మడి జిల్లాలో ఏడుగురు మృతి
- వైఎస్ఆర్‌లో ముగ్గురు యువకులు, అన్నమయ్యలో నలుగురు మృత్యువాత
- రెండు జిల్లాలోనూ విషాద ఛాయలు

వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వైఎస్ఆర్ జిల్లాలో ముగ్గురు యువకులు, అన్నమయ్య జిల్లాలో నలుగురు మృత్యువాత పడ్డారు. వైఎస్ఆర్ జిల్లాలో జాతర చూసుకుని తిరుగు వస్తుండగా, అన్నమయ్య జిల్లాలో వైద్యం కోసం వెళ్తుండగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో రెండు జిల్లాలో రోడ్లు నెత్తురొడ్డాయి. వివరాలు..



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

వైద్యం కోసం వెళ్తూ.. నలుగురు

ప్రజాశక్తి-రామాపురం



రామాపురం : రోడ్డుపై చెల్లాచెదురుగాపడిన మృతదేహాలు

కర్నూలు - చిత్తూరు 40 వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని నలుగురు మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కడప జిల్లా బద్వేల్ పట్టణానికి చెందిన నరసయ్య (47), లక్ష్మమ్మ (65), చిన్నక్క (60), రాజారెడ్డి (35), హర్షవర్ధన్ కారులో వైద్యం కోసం చిత్తూరు జిల్లా విరూపాక్షపురానికి బయలుదేరారు. రామాపురం మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ కొత్తపల్లి క్రాస్ వద్ద పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న మరో కారు వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మమ్మతోపాటు కుమారుడు నరసయ్య, కారు డ్రైవర్ రాజారెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కడప రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. వీరిలో చిన్నక్క చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతిచెందారు. లక్ష్మమ్మకు పక్షవాతం ఉండడంతో వైద్యం కోసం చిత్తూరు జిల్లాకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. మరో కారులో ప్రయాణిస్తున్న గుజ్జల వెంకట నాగేంద్ర వరప్రసాద్, తన భార్య, కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే అన్నమయ్య జిల్లా ఎస్పి గంగాధర్‌రావు, ఎఎస్‌పి రాజకమల్, డిఎస్‌పి శ్రీధర్, సం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదంపై సిఐ వరప్రసాద్, రామాపురం ఎస్ఐ కొండారెడ్డిని అడిగి తెలుసుకున్నారు.



చెన్నూరు : దుర్మరణం చెందిన యువకులు దినేష్, సురేష్, సుబ్బయ్య

జాతరకు వెళ్లి వస్తూ.. ముగ్గురు యువకులు

ప్రజాశక్తి- చెన్నూరు

కడప పట్టణ శివారులోని రాజంపేట-కడప బైపాస్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నూరు మండల పరిధిలోని పాలెంపల్లె వద్ద ఆదివారం తెల్లవారుజామున బైక్‌ను లారీ వేగంగా ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతిచెందారు. వివరాలు.. చెన్నూరు బెస్తకాలనీకి చెందిన బేస్తకాలనీకి చెందిన వర్ధనపోయిన వెంకటేశ్వర్లు, సుబ్బమ్మ కుమారుడు సురేష్ (23), రమణ, నాగమ్మ కుమారుడు దినేష్ (26), వెంకటరమణ, రమాదేవి కుమారుడు సుబ్బయ్య (19) అనే యువకులు ఆదివారం ఉదయం ఒంటిమిట్టలో గంగమ్మ జాతరను చూసుకుని బైక్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కడప పట్టణ శివారులోని రాజంపేట-కడప బైపాస్ రోడ్డు వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి చెన్నైకి వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు అక్కడిక్కడే మృతిచెందారు. వీరి ముగ్గరి తల్లిదండ్రులు చేపల వేటకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరాతీస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ ప్రభుత్వాస్పత్రి తరలించారు. కమలాపురం ఎమ్మెల్యే పి. రవింద్రనాథరెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, కమలాపురం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి కడప రిమ్స్‌కు వెళ్లి మృతదేహాలకు నివాళుర్పించి కుటుంబ సభ్యులు ఓదార్చారు. ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో చెన్నూరు బెస్తకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట

- 100 శాతం పన్ను వసూలు చేస్తాం
- త్వరలో15వ ఫైనాన్స్ నిధుల విడుదల
- జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి వెల్లడి



ముఖా ముఖి..

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లాలోని పంచాయతీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తాం, త్వరలో 15 ఫైనాన్స్ నిధుల వినియోగం, వచ్చే నెలాఖరు నాటికి వంద శాతం పంచాయతీ పన్ను సేకరణపై దృష్టి సారించాం. ఫలితంగా జిల్లాలోని 557 పంచాయతీల్లో పారిశుధ్యం మొదలుకుని పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించి ప్రజారోగ్యాన్ని పెంపొంది స్తాం. ఉపాధి హామీ నిధుల సహాయంతో పంచాయతీల్లోని గృహాలు మొదలుకుని రహదారులకు ఇరువైపులా, ఖాళీస్థలాల్లో మొక్కలను పెంచడంతో పచ్చదనాన్ని పరుస్తాం. ఫలితంగా గ్రామసీమలను పచ్చ దనానికి చిరునామాగా మారుస్తామని పేర్కొంటున్న జిల్లా పంచాయ తీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...

పంచాయతీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి?

త్వరలో 15 ఫైనాన్స్ నిధులు విడుదలయ్యే అవకాశం ఉం ది. వీటిలో 50 శాతం నిధులతో పంచాయతీల్లో శాశ్వత అభివృద్ధి పనులు, కరెంటు బిల్లుల చెల్లింపులు చేయాల్సి ఉంది. మిగిలిన 50 శాతం నిధుల్లో సగం తాగునీటి సరఫరాలకు, మిగిలిన నిధులను శానిటేషన్, ఇతర మెటీరియల్ కొనుగోళ్లకు వినియోగించుకోవాలి. ఎస్‌డబ్ల్యుపిసి ప్లాంట్ల సహాయంతో సాలిడ్ వేస్ట్ వేనేజ్ వ్యవస్థ ద్వారా చెత్తా చెదారాన్ని సేకరించి విక్రయం ద్వారా వచ్చే ఆదాయాన్ని పం చాయ తీ ఖాతాల్లో జమ చేయడం, వర్మీ కంపోస్టు ఎరువును తయా రు చేసి సరసమైన ధరలకు విక్రయిస్తాం.

పంచాయతీల వివరాలు తెలపండి?

జిల్లాలో 557 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,246 గ్రామాలు ఉన్నాయి. ఇందులో వేంపల్లి, పోరుమామిళ్ల, చెన్నూరు, ఖాజీపేట వంటి ఆరు మేజర్ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలోని పంచాయతీల నిర్వహణను 557 మంది కార్యదర్శులు పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్ప పురోగతిని వివరించండి?

డైలీక్లాప్ మిత్రలు ఇంటింటికీ తిరిగి తడిపొడి చెత్తలను వేరు చేసి పొడిచెత్తలోని గాజుముక్కలు, ప్లాస్టిక్‌వ్యర్థాలను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూపంలో సంపదను సృష్టించే ప్రయత్నం చేస్తున్నాం. ఎస్‌డబ్ల్యుపీసీ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తాం. కొన్ని మేజర్ పంచాయతీల్లో వచ్చే అధిక ఆదాయాన్ని డైలీ క్లాప్‌మిత్రలకు వేతన రూపంలో సర్దుబాటు చేయడానికి అవకాశం ఉంది.

ఎల్‌డబ్ల్యుఎం గురించి చెప్పండి?

లిక్విడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పంచాయతీల్లోని నీటి వృథాను అరికట్టడం, డ్రయినేజీ క్లీనింగ్, డ్రయినేజీ బ్లాకింగ్, వాటర్ స్టాగ్నేషన్ ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయడం ద్వారా దోమల వ్యాప్తిని నిరోధించడం వంటి చర్యలు తీసుకుంటున్నాం.

పారిశుధ్య నిర్వహణ చర్యలేమిటి?

జిల్లాలోని 557 పంచాయతీల పరిధిలోని 2,246 గ్రామా ల్లో పారిశుధ్య నిర్వహణకు 626 పారిశుధ్య నిర్వహణ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 525 పారిశుధ్య కేంద్రాల్లో 1301 క్లాప్ మిత్రలు, 1304 ట్రైసైకిళ్ల సహాయంతో పారిశుధ్య చర్యలు చేపట్ట డం జరిగింది.

ఓడిఎఫ్ ప్లస్ అంటే ఏమిటి?

ఓడిఎఫ్ ప్లస్ అంటే ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ అని అర్థం. జిల్లా లోని 557 పంచాయతీల వారీగా అమలుకు గట్టి కృషి చేస్తున్నాం. ఇందులోభాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా మల విసర్జన నివారణకు కృషి జరుగుతోంది. తక్కువ సమయంలో ఇటువంటి వ్యర్థాల నివారణపై అవగాహన కల్పించే కృషి ఊపందు కుంది.

పన్ను వసూలు వివరాలు తెలపండి?

జ: జిల్లాలోని 36 మండలాల పరిధిలోని 557 పంచాయతీల్లో 6,30,39,281 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.4,66,33, 636 కోట్ల మేరకు పన్ను వసూలు చేయడమైంది. దీంతో జిల్లాలో 73 శాతం నాన్‌టాక్స్ పన్నులు వసూలు చేశాం. ఇంటి, నీటి పన్ను లు 77 శాతం వసూలు చేశాం. మిగిలిన 23 శాతం మే నెలాఖరు నాటికి పూర్తి చేస్తాం. ఈలెక్కన 73.98 శాతం వసూలు చేశాం. మిగిలిన 27 శాతం పన్నులను మే నెలాఖరు నాటికి వసూలు చేయ డమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

టెన్షన్.. టెన్షన్

- వై.ఎస్. భాస్కర్‌రెడ్డి అరెస్టుతో వెల్లువెత్తిన నిరసనలు
- వైసిపి నాయకులు, కార్యకర్తల ఆందోళన
- సిబిఐకి వ్యతిరేకంగా నినాదాలు
- స్వచ్ఛందంగా దుకాణాల మూసివేత



పులివెందులలో నిరసన తెలియజేస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఆదివారం ఉదయం 6.05 నిమిషాలకు సిబిఐ అడిషనల్ ఎస్పీ ముఖేష్ శర్మ ఆధ్వర్యంలో 10 మంది అధికారులు కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి తండ్రి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్ రెడ్డి నివాసానికి సిబిఐ అధికారులు చేరుకుని వెళ్లి భాస్కర్ రెడ్డిని అరెస్టు చేశారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. వైసిపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించారు. సిబిఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వివేకా హత్య కేసులో వై.ఎస్. భాస్కర్‌రెడ్డి అరెస్టు, 14 రోజుల రిమాండ్ విధించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈనే పథ్యంలో పులివెందులలో టెన్షన్ వాతావరణం నెలకొంది. పూలంగళ్ల వద్ద వ్యాపారులు స్వచ్ఛంధంగా బంద్ పాటించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తుగా భారీ మోహరించారు. పులివెందుల అంతగా బంద్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు.

సిబిఐ అధికారులు రెండు కార్లలో పువెందులలోని భాస్కర్‌రెడ్డి ఇంటికి చేరుకోవడంతో వైసిపి కార్యకర్తలు, నాయకులు అక్కడి చేరుకుని ఆందోళన చేపట్టారు. కారును మోహరించి సిబిఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భాస్కర్‌రెడ్డి ఆయన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డిని కూడా అదుపులోకి తీసుకున్నారు. 120 - బి నోటీసులు జారీ చేసి సుమారు గంటపాటు పైగా మాట్లాడారు. 120బి , రెడ్ విత్ 301, 201 సెక్షన్ల కింద అరెస్టు చేసినట్టు వై.ఎస్. భాస్కర్ రెడ్డి భార్య లక్ష్మికి మెమో కాపీ అందించారు. అలాగే సమీప బంధువు జనార్దన్ రెడ్డికి సమాచారం ఇచ్చారు. వైఎస్ భాస్కర్ రెడ్డిని సిబిఐ అధికారులు భారీ భద్రత నడుమ రెండు ప్రత్యేక వాహనాలలో హైదరాబాదుకు తరలించారు. వైఎస్ భాస్కర్‌రెడ్డిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి సిబిఐ కోర్టు ఎదుట హాజరు పరిచారు. అంతకు ముందు ఆయనకు బిపి పెరగడంతో ఉస్మానియా ఆస్పత్రిలో వైద్యం చేయించిన తరువాత సిబిఐ కోర్టు ముందు హాజరు పరిచారు. సిబిఐ న్యాయమూర్తి భాస్కర్‌రెడ్డికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది.

మాజీ మంత్రి వై.ఎస్. వివేకానంద రెడ్డి హత్య కేసులో పులివెందులలో టెన్షన్ వాతావరణం నెలకొంది. రోజురోజుకు అరెస్ట్ సంఖ్య పెరగడంతో అనుమానితుల్లో కలకలం మొదలైంది. ఇదివరకే ఎర్ర గంగిరెడ్డి, సునీల్ కుమార్ యాదవ్, గజ్జల ఉమా శంకర్ రెడ్డి, షేక్ దస్తగిరి, దేవి రెడ్డి శివశంకర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్ అయ్యారు. సిబిఐ దృష్టిలో మరో 10 మందికి పైగా ఉన్నట్లు సమాచారం .ఇంకెంత మందిని అరెస్ట్ అవుతారో తెలియాల్సి ఉంది. మరో వైపు కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డిని కూడా అరెస్టు చేస్తారని జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

సిఎం రాజీనామా చేయాలి : ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి

కడప అర్బన్ : వివేకా హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డిని సిబిఐ అధికారులు అరెస్టు చేసినందుకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాజీనామా చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు బిల్డప్ వద్ద ఉన్న పుత్త ఎస్టేట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్య కేసును సీఎం జగన్ చేశారని విమర్శించారు. కుటుంబ సభ్యులు హత్య చేసి నేరాన్ని చంద్రబాబు నాయుడు పై వేసేందుకు కుట్ర పన్నారని విమర్శించారు. సూత్రధారులను సిబిఐ త్వరలో అరెస్టు చేస్తుందన్నారు.తెలిపారు. హత్య కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం వైయస్ భాస్కర్ రెడ్డి చేశారని చెప్పారు. రాజకీయ లబ్ధి కోసం వివేకా హత్య చంద్రబాబునాయుడు చేయించారు అన్న సీఎం జగన్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

భాస్కర్ రెడ్డి అరెస్టు అక్రమం : ఆకేపాటి

రాజంపేట అర్బన్ : వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టు అక్రమమని ఉభయ జిల్లాల జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. వైయస్ భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసినందుకు సిబిఐ తీరుకు నిరసనగా ఆదివారం వైఎస్ఆర్సిపి శ్రేణులతో కలిసి ఆర్అండ్.బి బంగ్లా వద్ద నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండులో సిబిఐ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాధారమైన ఆరోపణలతో భాస్కర్ రెడ్డిని అరెస్టు చేయడం దారుణమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న కళ్యా సుధాకర్

కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని బిఎస్ఎన్ఎల్ ఈయు జిల్లా అధ్యక్షులు కళ్యా సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్‌కు 4జి స్పెక్ట్రమ్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులు, రైతాంగం చేసే ఆందోళనలో నాయకులు భాగస్వాములు కావలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు. **నూతన కార్యవర్గం ఎన్నిక..**అధ్యక్షులుగా కళ్యా సుధాకర్, కార్యదర్శిగా ఆకుల సుబ్బారావు, కోశాధికారి పంతులు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా సుబ్బారెడ్డి కార్యదర్శిగా కళ్యాణ్ సుధాకర్ కోశాధికారిగా బీవీ సుబ్బయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీజీఎం శ్రీధర్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాసరావు, ఈయు రాష్ట్ర కార్యదర్శిలు రమాదేవి, బోస్, ప్రభాకరరావు, రాష్ట్ర అధ్యక్షులు యాకోబు, సహాయ కార్యదర్శులు బాలాజీ రామారావు ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

దార్శనికత గల సంఘ సంస్కర్త 'కందుకూరి'

ప్రజాశక్తి - కడప అర్బన్

మూఢ విశ్వాసాలను పారదోలి, బాల్యవివాహ వ్యవస్థను ప్రక్షాళనం చేసి, స్త్రీలను విద్యావేత్తలుగా ఎదిగేలా చేసి, వితంతు వివాహాలను ప్రోత్సహించి ఒక శతాబ్ది భవిష్యత్తు సమాజానికి పూలబాట వేసిన దార్శనికతగల సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంయుక్తంగా బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో ఆదివారం కందుకూరి వీరేశలింగం పంతులు 176వ జయంతి, తెలుగు నాటకరంగ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాటకరంగ కళాకారులు, పాఠకులు కలసి కందుకూరి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన

కడప సిటీ : కడప అగ్నిమాపక కేంద్రం పరిధిలోని ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా ఉన్న సత్యసాయి అపార్ట్‌మెంట్‌లో నందు అక్కడి ప్రజలకు ఎల్‌పిజి గ్యాస్, ఎలక్ట్రిక్ పొయిల వల్ల సంభవించి ప్రమాదాలపై సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి బసిరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు.

పోరుమామిళ్ల టౌన్ : గృహిణులు, గ్యాస్ వినియోగదారులకు అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది ఆదివారం అవగాహన కల్పించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా పోరుమామిళ్ల అగ్నిమాక అధికారి . వసంత నాయక్, సిబ్బంది, రాధ అపార్ట్ మెంట్, అమ్మవారిశాల వీధి, బంగ్లా వీధి, మెయిన్ బజార్‌లలో ప్రజలకు గ్యాస్, ఎలక్రికల్ అగ్నిమాపక నిరోధక చర్యలు వివరించారు.

మోడీని గద్దె దింపడి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

మోడీని గద్దె దింపి దేశాన్ని కాపాడాలని సిపిఎం మండల నాయకులు ఎన్. భైరవప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణలోని అంబేద్కర్ విగ్రహవ వద్ద మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రచార భేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల, ప్రయివేట్ విధానాలను తిప్పి కొట్టాలని అన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామిక హక్కులను కాపాడాలన్నారు. ఈనెల 18న సాయంత్రం నాలుగు గంటలకు సిపిఐ, సిపిఎం నిర్వహిస్తున్న ప్రచార భేరి బహిరంగ సభ పట్టణంలో నిర్వహిస్తామని ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున్న హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సిపిఎం మండల కమిటీ సభ్యులు బీబి,లూర్ద్ మేరీ, కుసులూరు రవి, ఆకుల వెంకటరమణ, మాబు, సుధాకర్, ఓబులమ్మ పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

హత్య కేసులో అరెస్టు చేస్తే ధర్నాలు, నిరసనలా..?

- మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

వివేకా హత్య కేసులో సిబిఐ విచారణ తరువాత వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తే ధర్నాలు, నిరసనలు చేయడమేంటని టిడిపి నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్. వరదరాజులరెడ్డి ప్రశ్నించారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వైసిపి నాయకులు ధర్నాలు, నిరసనలు ఎందుకు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఒక హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేస్తే నిరసనలు చేస్తున్నారా అంటూ విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డిపై నమ్మకం లేకనే సునీత కేసు విచారణను పక్క రాష్ట్రానికి పోయేలా చేశారని తెలిపారు. న్యాయమైన విచారణ చేసిన సిబిఐ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అమీర్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

చట్టానికి ఎవ్వరూ చుట్టం కాదు

చాపాడు : వైఎస్ వివేకా హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తే ధర్నాలు ఎందుకు చేస్తున్నారని, చట్టానికి ఎవ్వరూ చుట్టాలు కాదని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు కోసమే ఎస్‌పిని బదిలీ చేయకుండా ఉంచారన్నారు. ఇకనైనా ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. ధర్నాలు, ర్యాలీలు, ఆపి నిందితులకు కఠిన శిక్ష పడేలా సిబిఐకి సహకరించాలని టిడిపి తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

'కందుకూరి' గొప్ప సంఘ సంస్కర్త

ప్రజాశక్తి - వేంపల్లె

కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంఘ సంస్కర్త అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం కందుకూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తులసిరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యం, నాటకం అనే ఆయుధాలతో స్త్రీ విద్య వ్యాప్తికి, బాల్య వివాహాల నిర్మూలనకు, వితంతు వివాహాలను ప్రోత్సాహించడం, మహిళాల ఆర్థికస్వాలంబన కోసం జీవితాంతం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు.




కందుకూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తథ్యం

ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తథ్యమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 52 లోక్‌సభ సీట్లు మాత్రమే వచ్చాయని చెప్పారు. ఇండియా టుడే, సి ఓటర్స్ నిర్వహించిన సర్వేలో ఇప్పటికిప్పుడు లోకసభ ఎన్నికలు నిర్వహిస్తే 191 ఓట్లు వస్తాయని చెప్పారన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటోందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు జగన్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని తులసిరెడ్డి తెలిపారు.

జమ్మలమడుగు రూరల్ : మహిళల హక్కులు, స్త్రీ విద్య కోసం ఉద్యమించిన గొప్ప సంఘసంస్కర్త కందుకూరు వీరేశలింగం అని డివైఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్ తెలిపారు. కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకొని డివై ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక పతంగి రామన్న ప్రభుత్వ పాఠశాలతో ఆది వారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముందుగా ఎంఇఒ కృష్ణఫర్ మాట్లాడుతూ స్త్రీ విద్యాభివృద్ధికి వీరేశలింగం ఎనలేని కృషి చేశారన్నారు. నాడు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



కందుకూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

వినియోగదారులకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గ్యాస్ వినియోగంపై అవగాహన జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక రూరల్ పరిధిలోని అమృత్‌నగర్‌లో గోపవరం పంచాయతీలో ప్రజలకు గ్యాస్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ ఇంటిలో గ్యాస్ లీకైనప్పుడు ఇంటిలోని ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. కిటికీలు తలుపులు నెమ్మదిగా తీయాలని సూచించారు. వెంటనే 101కి సమాచారం అందించాలన్నారు. తదుపరి మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేయాలన్నారు. సిలిండర్ దగ్గర ఎలాంటి పేలుడు పదార్థాలు ఉంచకూడదని తెలిపారు. ఎక్కువ రోజులు బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు రెగ్యులేటర్ ఆఫ్ చేసి ఇంటి ముందు ఎలక్ట్రికల్ స్విచ్‌లను పూర్తిగా ఆఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



లీకైన గ్యాస్ సిలిండర్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పులివెందుల రూరల్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జయమ్మ కాలనీలో గ్యాస్ ప్రమాదాల పట్ల అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ తన సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు నివారణ చర్యలు, గ్యాస్ ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు డెమో ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మహిళలు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

న్యాక్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - వేంపల్లె

రాబోయే రోజుల్లో ప్రతి ఇంజినీరింగ్ కళాశాల న్యాక్ అక్రిడిటేషన్ సాధించాలని ఆర్‌జెయుకెటి యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెసి రెడ్డి తెలిపారు. మండలంలోని ఇడుపులపాయి ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో ఆదివారం అసెస్‌మెంట్ ప్రాసెస్, ప్రిపరేషన్ అఫ్ సెల్ఫ్ స్టడీ రిపోర్టు ఫర్ న్యాక్ అక్రిడిడేషన్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కెసి రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకు రాబోవు కాలంలో న్యాక్ అక్రిడిడేషన్ గుర్తింపు తప్పనిసరి అని తెలిపారు. న్యాక్ గుర్తింపు వల్ల కళాశాల నాణ్యత ప్రమాణాలను పెంపొందించుకోవచ్చునని తెలిపారు. కళాశాలల్లో విద్యార్థి విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకొనేలా కళాశాలలు పని చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాలలు న్యాక్ తెచ్చుకోవడం కష్టతరమేమీ కాదన్నారు. విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించి, గొప్ప అవకాశాలు అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌జెయుకెటి క్యాంపస్‌ల అధికారులు, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు

రేషన్ కోసం ఎదురుచూపులు



రేషన్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - చాపాడు

ఏప్రిల్ నెల 16వ తేదీ పూర్తయినా మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రూ.1అందించే రేషన్, బియ్యం పంపిణీని ఇంకా మొదలుపెట్టలేదు. ఈ పరిస్థితుల్లో పేదలు బియ్యం, నిత్యవసర సరుకుల కోసం ఎదురుచూస్తున్నారు. బియ్యం, కందిపప్పు, చక్కెర సచివాలయంలో నిల్వ ఉన్నప్పటికీ పంపిణీ చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పౌర సరఫరా, రెవెన్యూ అధికారులు, ఎండియూ ఆపరేటర్ల నిర్లక్ష్యం కొట్టోచ్చినట్లు కనిపిస్తోందనే ఆరోపణలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు రేషన్ సరుకులు ఇంటివద్దకే అందించేందుకు చేపట్టిన చర్యలు అల్లాడుపల్లెలో మూడు నెలలుగా అమలు కావడం లేదని తెలుస్తోంది. రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా జరగడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా అధికారులు జాప్యం ఎందుకు చేస్తున్నారో అర్థం కావడంలేదు. సాధారణంగా ప్రతినెలా ఒకటో తేదీ నుంచే బియ్యం పంపిణీ ప్రారంభమవుతుంది. ఏప్రిల్ నెల 16 రోజులు గడిచినా రేషన్ ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గత ఫిబ్రవరి నెలలో రేషన్ షాపును ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ సిబ్బంది తనిఖీ చేసి నిలవలలో తేడాలు ఉన్నట్లు గుర్తించి డీలర్ లక్ష్మి రామ ప్రసన్నపై క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామని సూచించి, 6ఎ కేసు నమోదు చేయకుండానే గ్రామ విఆర్ఎ భద్రకు రేషన్ బాధ్యతలు అప్పగించారు. అయినప్పటికీ పంపిణీలో జాప్యం జరుగుతోంది. బియ్యం పంపిణీలో జరుగుతున్న జాప్యంపై విఆర్ఒ, ఆర్ఐని వివరణ కొరగా గతంలో స్టాకు మంజూరులో తలెత్తిన ఇబ్బందులతో పంపిణీ ఆలస్యమైందన్నారు. వెంటనే రేషన్ పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతి నెలా సక్రమంగా ఇవ్వాలి



ప్రతి నెల రేషన్ బియ్యం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. కాలనీలోకి రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనం రాకపోవడంతో కిలోమీటర్ మేర నడుచుకుంటూ వెళ్లి వీరభద్రపురంలో రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు వాహనాన్ని ఏర్పాటు చేసినా ఉపయోగంలేదు. బియ్యాన్ని మాత్రమే ఇస్తూ చక్కర, కందిబేడలు ఇవ్వడం లేదు. అధికారులు స్పందించి ప్రతినెల రేషన్ సరుకులు అందేలా చూడాలి.

- ఓబులమ్మ, దాసర కాలనీ, అల్లాడుపల్లె

మూడు నెలలుగా రేషన్ అందలేదు



మూడు నెలలుగా రేషన్ సరుకులు అందడం లేదు. గతంలో డీలర్ ఇంటి వద్ద బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేసేవారు. డీలర్‌ను తొలగించి విఆర్ఎను నియమించినప్పటి నుండి బియ్యం పంపిణీ జరగ లేదు. ఉన్నత అధికారులు స్పందించి క్రమం తప్పకుండా రేషన్ సరుకులు పంపిణీ చేయాలి.

- ఏసోబ్, ఎస్‌సి కాలనీ అల్లాడుపల్లె

ఎండియు ఆపరేటర్ మిషన్‌లో సమస్య




మూడు నెలలుగా అల్లాడుపల్లె రేషన్ షాప్‌నకు విఆర్ఎ అయిన నాకు రేషన్ పంపిణీకి అథంటిఫికేషన్ అప్పగించారు. గతంలో రేషన్ బియ్యం పంపిణీ సమయంలో జరిగిన సమస్యలతో 70 క్వింటాళ్లకు గానూ 19 క్వింటాలు మాత్రమే బియ్యం మంజూరయ్యాయి. చక్కర, కందిబేడలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. ఎండియు ఆపరేటర్ రాకపోవడంతో రేషన్ పంపిణీ చేయలేదు.. వెంటనే పంపిణీ ప్రారంభిస్తాం.

- భద్ర, విఆర్ఎ, రేషన్ పంపిణీ అనుమతిదారుడు

వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్ :

మాజీ మంత్రి వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ స్థానిక శివాలయం సర్కిల్‌లో ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బీముని పల్లి లక్ష్మీదేవి నాగరాజు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారురెడ్డి, రాష్ట్ర ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ, రాష్ట్ర పద్మశాలియ కార్పొరేషన్ చైర్మన్ జింక విజయలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఎంపిపి సానబోయిన శేఖర్ యాదవ్, కాకర్ల నాగ శేషారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, పట్టణ అధ్యక్షురాలు కోనేటి సునంద, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **వేంపల్లె :** వైఎస్ భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, సర్పంచు రాచినేని శ్రీనివాసులు, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. సిబిఐ అధి కారులు వైఎస్ భాస్కర్‌రెడ్డిని ఆదివారం అరెస్టు చేసిన నేపథ్యంలో స్థానిక వైఎస్ఆర్ అతిథిగృహం నుంచి ఆర్‌టిసి బస్టాండు వరకు వైసిపి నాయకులు పెద్ద ఎత్తున నల్ల బ్యాడ్జీలు ధరించి, శాంతి యుతంగా నిరసన ర్యాలీ చేప ట్టారు. కార్యక్రమంలో చక్రాయపేట జడ్‌పిటిసి శివ ప్రసాద్ రెడ్డి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ వలి, హజ్ హౌస్ డైరెక్టర్ మునీర్, సల్మా, ఎంపిటిసిలు కటిక చంద్రశేఖర్, పద్మా రాజ్‌కుమార్, కుమ్మ రాంపల్లె సర్పంచు మునేష్, రవిశంకర్ గౌడ్, నిషార్, రహం తుల్లా ఖాన్, ఖాదర్ బాషా, కటిక బాబా, షేక్షావలి, భారతి, మోహన్ పవర్, చంద్ర శేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, ముత్యాల ఆంజి నేయులు, సోషల్ మీడియా కన్వీనర్ పఠాన్ గౌస్, నాగేంద్ర, పలువురు నాయకులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి లక్ష్యంగా సిబిఐ విచారణ జరుగు తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొ న్నారు. సిబిఐ అధికా రులు వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసిన నేప థ్యంలో ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయం నుండి పాత బస్టాండు వరకు ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, హస్తకళల చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి, వైసిపి పట్టణ అధ్య క్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లా జానీ, డైరెక్టర్ మార్బుల్ శీను, హనుమంత్‌రెడ్డి, బడిగింజల చంద్రమౌళి, మైనార్టీ నాయకులు బేపారి షామీర్ అలీ, కిరణ్‌కుమార్, పార్టీ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డిని ఆదివారం ఉదయం సిబిఐ అధికారులు అరెస్టు చేయ డాన్ని నిరసిస్తూ ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో వైసిపి శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. సిబిఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు, నాయకులు



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాయకులు



ఇఫ్తార్ విందులో శ్రీనివాసులరెడ్డి, బిటెక్ రవి, ముస్లింలు

ఇఫ్తార్ విందులో టిడిపి నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక బిడ్డాలమిట్ట ప్రాంతంలో ఉన్న బిలాల్ మసీదులో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రారెడ్డి హాజరయ్యారు. టిడిపి మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్‌తోపాటు నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల మూల్యాంకనం పూర్తి

కడప అర్బన్ : ఇంటర్ పరీక్ష పేపర్ల మూల్యాంకనం ప్రశాంతంగా ముగిసిందని ఆర్ఐఒ రమణ రాజు తెలిపారు. ఆదివారం మూల్యాంకన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2,92,225 పరీక్ష పేపర్లను మూల్యాంకనం చేశారని పేర్కొన్నారు. బోర్డు ఆదేశాల మేరకు 1400 మంది సిబ్బంది హాజరై మూల్యాంకనం పూర్తి చేయడం అభినందనీయమని చెప్పారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

కడప అర్బన్ : నగరంలోని కాగితాలపెంటలో ఉన్న కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో లజ్నతుల్ ఉలమా కమిటీ స్థాపకులు, కార్యదర్శి మౌల్వి మొహమ్మద్ అలీ రషాది ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీకార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మోల్వి మసీవుల్లాహ్, జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.డి తాహిర్, అమీన్ హాస్పిటల్స్ చైర్మన్ షైక్ నయీమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రంజాన్ మాసంలో లజ్నతుల్ ఉలమా కమిటీ ఆధ్వర్యంలో పేద ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. లజ్నతుల్ ఉలమా కమిటీ వారి సేవలకు వెలకట్టలేమని తెలిపారు. ప్రతి ఒక్కరూ పేదలకు జాకత్, ఫిత్రాలు ఇచ్చి మనతో పాటు వారు కూడా పండగ చేసుకోవడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మౌల్వి హాఫిజ్ అస్గర్‌అలీ,ప్రభుత్వ ఖాజి ఇషాక్, ఖాజీ జుబేర్, హాఫిజ్ అబ్దుల్లాహ్, లజ్నతుల్ ఉలమా కమిటీ కోశాధికారి మౌలానా నూరుల్లాహ్, టిడిపి నాయకులు అక్బర్, రెహమాన్, అక్రమ్ మైనార్టీ మహిళలు పాల్గొన్నారు.

శాశ్వత ఉపాధ్యాయులుగా ఉత్తర్వులివ్వాలి

కడప అర్బన్ : డిఎస్‌సి 2008 ఎంటిఎస్ ఉపాధ్యాయులను శ్వాశత ఉద్యోగులుగా గుర్తిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా పరిషత్ వద్ద 2008 డీఎస్సీ మినిమంటైం స్కేల్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008 డిఎస్‌సిలో రాష్ట్రవ్యాప్తంగా 2,193 మంది మినిమం టైం స్కేలు ఉపాధ్యాయులుగా నియమించబడ్డారని తెలిపారు. వీరికి గత సంవత్సరం 10 నెలల జీతం మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. వారికి ఇచ్చిన నియమాక పత్రంలో పది నెలల జీతం మాత్రమే అని ఎక్కడ సూచించలేదని చెప్పారు. ప్రస్తుతం 12 నెలల జీతం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. హైకోర్టు వీరిని రెగ్యులర్ ఉపాధ్యాయులుగా ఆర్డర్స్ ఇవ్వాలని 2022, సెప్టెంబర్‌లో సూచించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్పందించి 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు రెగ్యులర్ ఉపాధ్యాయులుగా నియమించడానికి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో ఎస్‌టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. వెంకటసుబ్బయ్య, రాష్ట్ర నాయకులు ఆవుల రామచంద్ర, జిల్లా నాయకులు మదన్ మోహన్ రెడ్డి, సాగర్, రవిశంకర్, 2008 ఎంటిఎస్ ఉపాధ్యాయులు నాగేందర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎల్.వి. వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సైకిళ్లు ఇవ్వాలని విద్యార్థుల వినతి



ఎండలో ఉన్నత పాఠశాలకు నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - బి.కోడూరు

తమకు సైకిళ్లు పంపిణీ చేయాలని మండలంలోని గోవిందాయపల్లె జడ్‌పి ఉన్నత పాఠశాల దూర ప్రాంత విద్యార్థులు కోరుతున్నారు. దాదాపు 30మంది పేద విద్యార్థులు మున్నెల్లి, రాజుపాలెం, తువపల్లి, టంటంవారిపల్లి గ్రామాల నుంచి నడుచుకుంటూ గోవిందాయపల్లె ఉన్నత పాఠశాలకు నిత్యం వస్తూంటారు. చాలా అసౌకర్యంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు సరైన సమయానికి బస్సు సౌకర్యంలేదని విద్యార్థులు తెలిపారు. నిత్యం పుస్తకాలను మోసుకుంటూ ఎండలకు స్కూల్‌కు నడిచివెళ్లాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే తమకు సైకిళ్లు పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని వారు వేడుకుంటున్నారు.

శైలజానాథ్‌ను కలిసిన రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్

ప్రజాశక్తి - కడప

కాంగ్రెస్ పార్టీ మాజీ పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు శైలజానాథ్‌ను కడప ఆర్ అండ్ బి అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయ ల పైన చర్చించారు. యువత చాలామంది రాజకీయాల్లోకి రావాలని అప్పుడే రాష్ట్రంలోనూ దేశంలోనూ కాంగ్రెస్ పార్టీ మరింతగా పుంజుకుంటుందని శైలజనాథ్ తెలిపారు. కార్య క్రమంలో ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ఉప అధ్యక్షులు ధ్రువ కుమార్‌రెడ్డి , జిల్లా అధ్యక్షులు మామిళ్ల బాబు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వస్త్రాలు పంపిణీ

కడప : ఆశ రేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కడప జువెనైల్ హోమ్‌లో ఆదివారం పిల్లలకు నూతన వస్త్రాలు పంచిపెట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంధ సేవా సంస్థల వారు చిన్నారులకు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశ రేఖ ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి కోరారు. మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం వైసి పికి చెందిన ఏమిరెడ్డి బాల కృష్ణారెడ్డి తోపాటు ఆయన అనుచరులు దాదాపు 100మంది టిడిపిలో చేరారు. వీరికి బిటెక్ రవి పార్టీ కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిటెక్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ వైసిపి నుండి టిడిపిలోకి వలసలు ప్రారంభమయ్యాయన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలో కూడా టిడిపి జెండా ఎగుర వేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడులా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సముచిత స్థానం కావాలంటే పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, పాపిరెడ్డి, డక్కా రమేష్, మహమ్మద్, తెలంగాణ వలి, జబీవుల్లా, గోగుల మల్లికార్జున, గోగుల మారుతి, పిపి చెంద్రాయుడు, వెంకటయ్య, రవికుమార్, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో బిటెక్ రవి, నాయకులు

ప్రచార భేరి గోడపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కర్షక, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి గోడపత్రాలను ఆదివారం నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 14 నుంచి 30 వరకు జరుగుతున్న ప్రచార భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న నీరు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మండలం వనిపెంట రేంజ్ తిప్పిరెడ్డిపల్లి నల్లమల్ల అటవీ ప్రాంతంలో బాలబావి పక్కనే ఉన్న బోరు నుండి నీరు పొంగి పొర్లుతోందని చరిత్ర కారుడు, రచయిత బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. నల్లమల అటవీ ప్రాంతంలో బాలబావి పేరు సుపరిచితం. సకల జంతుజాలానికి బాలాబావి నీరే ప్రాణాధారమన్నారు. పురాతన ప్రాశస్త్యం ఉన్న బాలబావి ఏప్రిల్, మే నెలల్లో ఉండే అధిక ఉష్ణోగ్రతలతో నీరు ఇంకిపోయి ఎండిపోతుందన్నారు. దీంతో అటవీ ప్రాంతంలోని అనేక జంతువులు నీరు దొరకక అలమటిస్తూ ఉంటాయని చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా బాలబావి సమీపంలో బోరు వేయాలని అటవీ శాఖ అధికారులు సంకల్పించి దానికయ్యే ఖర్చు కోసం రాష్ట్ర ప్రభుత్వ అటవీ శాఖ నుండి డబ్బు మంజూరు చేయించుకుని బోరును మార్చి 2020లో 836 అడుగుల లోతులో వేశారని చెప్పారు. బోరు వేసే పనిని డిఆర్ఒ హజమతుల్లా దగ్గరుండి చేయించారని తన సొంత ఖర్చులు కూడా వినియోగించాడని వివరించారు. అందుకే ఈ బోరుకు హజ్మతుల్లా పేరు పెట్టాలని కొండ కింద జనాలు కోరుతున్నట్లు చెప్పారు. బాలబావి బోరు నుండి నీరు మూడేళ్లుగా ఏకధాటిగా పొంగిపొర్లుతోందని, ఆ నీటిని బాలబావికి అనుసంధానం చేసి జంతువుల దాహం తీరుస్తున్నారని తెలిపారు. ఇలా నీరు రావడంలో శాస్త్రవేత్తలకు సైతం అంతు పట్టడం లేదని, దీనిపై మరింత విస్తృతమైన పరిశోధనలు శాస్త్రవేత్తలు చేయవలసిన అవసరం ఉందని సూచించారు. ఈ ప్రాంతాన్ని టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలని రమేష్ కోరుతున్నారు.



వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు అన్యాయం

- టిడిపి ఇన్‌ఛార్జి జి.వి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వస్తే అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇస్తామని జగన్ చెప్పి, అధికారంలోకి రాగానే మొండిచెయ్యి చూపారని టిడిపి ఇన్‌ఛారి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మండలం పరిధిలోని కాల్వకట్టలో ఆదివారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలపై దాడులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను, తప్పిదాలను, రైతులకు, సామాన్య ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తున్న టిడిపి నాయకులపై ఈ ప్రభుత్వం దాడులు చేయిస్తోందన్నారు. అక్రమంగా నిర్బంధిస్తూ, తప్పుడు కేసులు నమోదు చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, శ్రీనివాసులురెడ్డి, గోపవరం కిట్టు, ద్వారకనాథ్‌రెడ్డి, పెద్దన్న, మార్తల ప్రతాపరెడ్డి, మార్తల సుబ్బారెడ్డి, డిష్ రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న ప్రవీణ్, నాయకులు

అన్నదానం గొప్పది : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అన్నదానం చాలా గొప్పదని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డ మసీదు వద్ద టిడిపి మైనార్టీ నాయకులు ఫరాజ్, దాదా పీర్, షబ్బీర్, కలందర్, సాదాబ్, రఫీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు భూపేష్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మదర్‌వలి, మున్నా, జిలాన్, సయ్యద్, మస్తాన్, గైబు, నాగూర్, గైబుబాషా, పొన్నతోట శ్రీనివాసులు, రఫీ, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్ విజేత భగదీశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలో చెస్ ఆఫ్ హాల్లో నిర్వహించిన 15వ అశ్రఫ్-ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంట్ విజేతగా కమలాపురానికి చెందిన రేటెడ్ చెస్ క్రీడాకారుడు భగదీశ్వర్ రెడ్డి నిలిచాడు. ఐదు రౌండ్లకు గానూ ఐదు పాయింట్లు సాధించి టోర్నమెంట్ విజేతగా నిలిచాడు. రూ.1000 నగదు బహుమతిని, రోలింగ్ ట్రోఫీని అందుకున్నాడు. కడపకు చెందిన మరో రేటెడ్ చెస్ క్రీడాకారుడు శ్రీకాంత్ 5 రౌండ్లకుగానూ ఐదు పాయింట్లు సాధించి టై బ్రేక్ స్కోరులో రెండవ స్థానం దక్కించుకున్నాడు. మూడవ స్థానంలో ప్రభుదేవా, నాలుగవ స్థానంలో లాస్యశ్రీ, ఐదవ స్థానంలో పృథ్విరాజ్, ఆరవ స్థానంలో సుందర రాజా, ఏడవ స్థానంలో రెడ్డి పవన్, ఎనిమిదవ స్థానంలో ప్రణవ్ రెడ్డి, 9వ స్థానంలో నజీర్, పదవ స్థానంలో లిఖిత్ నిలిచారు. కడప, ప్రొద్దుటూరు, కమలాపురం, రైల్వేకోడూరు, చిన్నమండెం ప్రాంతాల నుండి మొత్తం 44 మంది చెస్ క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనీస్ దర్బారి తెలిపారు. విజేతలకు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ జి.విశ్వనాథరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనీస్ దర్బారి, చీఫ్ ఆర్బిటర్ రామ లక్ష్మణ్, చెస్ కోచ్ తబసుము, చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.



చెస్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన భగదీశ్వరరెడ్డి